

విద్యారంగ పరిరక్షణ ఉద్యమాలకు సన్నద్ధం

ప్రజాశక్తి - భీమవరం

ఎస్ఎఫ్ఐ అఖిలభారత మహాసభలో విద్యారంగ పరిరక్షణకు పలు తీర్మానాలు చేశారని, వీటి ఆధారంగానే భవిష్యత్ ఉద్యమాలకు సిద్ధంగా ఉన్నామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.వాసు, డి.పెద్దిరాజు అన్నారు. హైదరాబాద్, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ అఖిలభారత మహాసభకు వాసు, పెద్దిరాజు, కమిటీ సభ్యులు ఆర్.రాజీ, పి.సుజాత రాష్ట్రం నుంచి ప్రతినిధులుగా వెళ్లారు. సందర్భంగా అక్కడ అమరవీరుల స్థూపానికి నివాళులర్పించి మాట్లాడారు. దేశవ్యాప్తంగా విద్యారంగంలో వస్తున్న మార్పులపై ఈ మహాసభలో చర్చించామన్నారు. భవిష్యత్‌లో ఏ పోరాటాలు చేయాలో ఈ మహాసభలో నిర్ణయాలు తీసుకుంటారని చెప్పారు. నూతన జాతీయ విద్యావిధానం వ్యతిరేకిస్తూ, జాతీయ యూనివర్సిటీకి నిధులు కేటాయించాలని, నిరుద్యోగ నిర్మూలన, ఒకే దేశం ఒకే భాష హిందీని వ్యతిరేకిస్తూ తీర్మానాలు చేశారని, వీటిపై భవిష్యత్తు ఉద్యమాలుంటాయని పేర్కొన్నారు.

భారమంతా వారిపైనే..!

పని ఒత్తిడితో వీఆర్‌ఒలు సతమతం - రీసర్వే వ్యయం కూడా వారిదే - అదనపు పనులతో మానసిక ఒత్తిడి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్




పని ఒత్తిడితో రెవెన్యూ శాఖలో వీఆర్‌ఒలు సతమతమవుతున్నారు. ఏ ఒక్క వీఆర్‌ఒను కదిలించినా ఒక్కొక్కరు ఒక్కో గాథ ప్రస్తావిస్తున్నారు. వీఆర్‌ఒలకు వంద రోజుల్లో రీ సర్వేను పూర్తి చేయాలని లక్ష్యాలను నిర్దేశించడంతో మరింత సతమతమవుతున్నారు. దానికితోడు ఈ రీసర్వేకు సంబంధించిన వ్యయమంతా వారే పెట్టుకునేలా ఆదేశాలు జారీ చేస్తున్నారు. గ్రామస్థాయిలో విధులు నిర్వహించే వీఆర్‌ఒలకు జీవితం పనిభారం అధికమైంది. ఎప్పుడు ఏ బాధ్యత మీద పడుతుందోనన్న ఆందోళన వెంటాడుతోంది. పనిభారం తగ్గించాలంటూ పలుదఫాలు వీఆర్‌ఒలు నిరసనకు దిగే దుస్థితి ఏర్పడింది. విధులతో పాటు ఆర్థిక ఇబ్బందులు చుట్టుముడుతున్నాయి. మండల స్థాయి నుంచి, జిల్లా అధికారుల వరకూ వినతిపత్రాలను సమర్పిస్తూనే ఉన్నారు. రాష్ట్రస్థాయిలోనూ సమస్యలు చెప్పుకున్నా ఫలితం దక్కడం లేదు. ఫలితంగా జీవీఎల్ రాష్ట్రవ్యాప్తంగా వీఆర్‌ఒలు నిరసన తెలిపారు. అయినా ఉన్నతాధికారుల్లో చలనం లేదు. ప్రభుత్వం ఆదేశించే విధులను గంటల వ్యవధిలోనే పూర్తి చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఒత్తిళ్లు ఎదురవుతున్నాయి. సచివాలయాలు ఏర్పాటైనా గ్రామస్థాయిలో ఉండే వీఆర్‌ఒలకు తిప్పలు తప్పడం లేదు. ప్రధానంగా వెబ్‌ల్యాండ్ సమస్యలు పరిష్కరించాల్సి వస్తోంది. దానికోసం క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించాలి. పట్టాదారు పాస్ పుస్తకం జారీ చేయాలంటే గతంలో నెలన్నర రోజుల వ్యవధి ఉండేది. ఇప్పుడది 21 రోజులకు కుదించారు. అప్పటిలోగా పట్టాదారు పుస్తకం మంజూరు చేయకపోతే వీఆర్‌ఒలనే బాధ్యులను చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించి క్లియరెన్స్ ఇస్తేనే పట్టాదారు పుస్తకం మంజూరవుతోంది.

వ్యయమంతా వీరిపైనే..

జగనన్న భూరక్ష పథకంలో గ్రామాల్లో రీ సర్వే నిర్వహిస్తోంది. అందుకోసం ఇతర ప్రాంతాల నుంచి సిబ్బందిని నియమిస్తున్నారు. వారికి అవసరమైన సౌకర్యాలను కల్పించే బాధ్యత వీఆర్‌ఒలపై పడుతోంది. మరోవైపు రీ సర్వేకు అయ్యే వ్యయాన్ని వారే భరిస్తున్నారు. గ్రామస్థాయిలో ప్రాథమికంగా నిర్వహించిన సర్వేకు గరిష్టంగా రూ.50 వేల వరకూ సొంత సొమ్ములు వెచ్చించారు. పూర్తిస్థాయిలో సర్వే నిర్వహిస్తే మరింత ఆర్థిక భారాన్ని మోయాల్సి ఉంటుంది. రీ సర్వే నిర్ణీత వ్యవధిలోనే పూర్తి చేయాలన్న ఒత్తిడి అధికమవుతోంది. ప్రభుత్వం మాత్రం ఇప్పటి వరకూ పైసా బిల్లు మంజూరు చేయలేదు. అంతా రెవెన్యూ ఉద్యోగులే భరిస్తున్నారు. రీసర్వేలో భాగంగా సర్వేయర్లతో క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సి వస్తోంది. ఒకవైపు పనిఒత్తిడి ఎదురవుతుంటే మరోవైపు ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి.

ధాన్యం కొనుగోలు బాధ్యతా వీరిదే..

ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో ఎన్నడూ లేని విధంగా వీఆర్‌ఒలను కస్టోడియన్‌లుగా నియమించింది. రైస్ మిల్లుల వద్ద కస్టోడియన్ ఆఫీసర్ బాధ్యతలను వారు నిర్వహిస్తున్నారు. ఇటీవల ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా సాగడం లేదు. తేమ శాతంలో తేడా ఉంటోంది. రైతు భరోసా కేంద్రాలకు, రైస్ మిల్లుల వద్ద తేమ శాతానికి పొంతన కుదరడం లేదు. దాంతో వీఆర్‌ఒలే కస్టోడియన్‌లుగా సమస్యను పరిష్కరించాల్సి వస్తోంది. నిత్యం కొనుగోలు బాధ్యతను నిర్వహిస్తూ ఒత్తిడికి గురవుతున్నారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి తప్పులు జరిగితే కస్టోడియన్ ఆఫీసర్లను బాధ్యులను చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. ఇలాంటి హెచ్చరికలతో వీఆర్‌ఒలు బెంబేలెత్తిపోతున్నారు. రెవెన్యూ శాఖకు సంబంధం లేని బాధ్యతలు ఇప్పుడు వీఆర్‌ఒలు నిర్వహించాల్సి వస్తోంది. జగనన్న ఇళ్ల స్థలాలకు సంబంధించి ఇదివరకే నిర్వహించిన సర్వేలో వీఆర్‌ఒలే ప్రధాన భూమిక పోషిస్తున్నారు. కొంతకాలంపాటు దీనిలోనే నిమగ్నమయ్యారు. అంతలోనే లబ్ధిదారులు ఇళ్ల ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలంటూ ఆదేశాలొస్తున్నాయి. ఆ బాధ్యత కూడా వారిపైనే పడుతోంది. వ్యవసాయ గణాంకాల విధులను నిర్వహిస్తున్నారు. ఇ-క్రాప్ నమోదులోనే పాటు, వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించి గణాంకాలను సిద్ధం చేయాల్సి వస్తోంది. ఇలాంటి విధులతో పాటు ప్రతినిత్యం నిర్వహించాల్సిన విధులు అనేకం ఉంటున్నాయి. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఒబిసి, ఇడబ్ల్యుఎస్, ఎన్‌ఒసి, వ్యవసాయ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాల్సి ఉంటుంది. వీటికితోడు ప్రకృతి వైపరీత్యాలు ఎదురైతే క్షేత్రస్థాయిలో బాధ్యతంతా వారిపైనే పడుతోంది. జాతర సమయాల్లో దేవాలయాల వద్ద విధులను నియమిస్తున్నారు. దీనికితోడు ప్రతీ సోమ, గురువారాల్లో సమావేశాలు ఉంటున్నాయి. ఎన్నికల విధులు తప్పడం లేదు. స్పందనలో సెల్ఫీ ఫొటో తప్పనిసరి చేశారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైతే పరిరక్షించే బాధ్యత వారిదే. ఇలా చెప్పుకుంటూ పోతే లెక్కకు మిక్కిలి విధులతో మానసిక ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. రాష్ట్రస్థాయి అధికారులకు సైతం సమస్యలు చెప్పుకున్నా పరిష్కారం లభించడం లేదు.



మాట్లాడుతున్న ఎంఎ గఫూర్

కార్మిక హక్కులను హరిస్తున్న బిజెపి

సిఐటియు రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.ఎ.గఫూర్

ప్రజాశక్తి - తణుకురూరల్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చట్టాల్లో మార్పులు, సవరణలు చేస్తూ కార్మికుల హక్కులను హరిస్తోందని మాజీ ఎమ్మెల్యే, సిఐటియు రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.ఎ.గఫూర్ అన్నారు. వచ్చేనెల రెండు, మూడు, నాలుగు తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరగనున్న సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ సందర్భంగా గురువారం తణుకులోని ఎన్‌జిఒ హోమ్‌లో 'కార్మిక చట్టాలు-ప్రభుత్వాల వైఖరి' అంశంపై సిఐటియు నేత పి.దక్షిణామూర్తి అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన గఫూర్ ప్రసంగించారు. బిజెపి ప్రభుత్వం అధికార బలంతో చట్టాలను ఇష్టానుసారంగా మార్చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో 29 చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చారన్నారు. కార్మికుల హక్కులను హరించే ఆలోచనతోనే చట్టాలలో మార్పులు చేశారన్నారు. ప్రపంచంలో భారతదేశంలోనే చట్టాలు కఠినంగా ఉన్నాయని, కార్మికులకు అనేక హక్కులను కల్పిస్తున్నాయని, ఏదైనా ఫ్యాక్టరీ యాజమాన్యం ఎవరినైనా తొలగించాలంటే వీలులేని పరిస్థితి చట్టాల వల్ల ఉందని, అంతేకాక కొన్ని చట్టాల వల్ల విదేశీ పెట్టుబడి వచ్చే వీలులేదని, ప్రపంచంలోని ధనవంతులు భారతదేశంలో పెట్టుబడులు పెట్టడానికి, పరిశ్రమలు పెట్టడానికి భయపడుతున్నారని, ఈ చట్టాల్లో మార్పు తీసుకువస్తేనే వారంతా ఇండియాలో పెట్టుబడులు పెడతారని మోడీ చెప్పడం అవివేకమన్నారు. అంతేకాక దేశభక్తి ఉంటే హక్కులను కోల్పోవాల్సి వస్తుందని చెప్పడం దారుణమన్నారు. పెట్టుబడులు రాకపోతే దేశం అభివృద్ధి కాదని, దేశం అభివృద్ధి కావాలంటే కార్మికులు స్వతహాగా బానిసలుగా మారాలనే చేతకానితనంతో ప్రధాని నరేంద్ర మోడీ ముందుకుసాగుతున్నారని విమర్శించారు. ఎన్నికల సందర్భంగా ఏడాదికి రెండు కోట్లు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని, అధికారం చేపట్టిన తర్వాత ఇప్పటి వరకూ ఎన్ని కోట్ల ఉద్యోగాలిచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. మోడీ హామీలన్నీ బోగస్ అని, ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వని పరిస్థితి ఉందన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా దేశంలో నిరుద్యోగం ఉందన్నారు. రాష్ట్రంలో సిఎం జగన్ కార్మికుల వేతనాలు పెంచే ఆలోచన చేయకపోవడం దారుణమన్నారు. అందుకే రానున్న రోజుల్లో కార్మికులు, ఉద్యోగులు ఐక్యంగా పోరాటాలు చేయాలని, హక్కులను సాధించుకోవాలని పిలుపు నిచ్చారు. సిఐటియు 16వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, ఉపాధ్యక్షులు పిఎల్.నరసింహారావు, జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, శ్రామిక మహిళా నాయకురాలు అడ్డగర్ల అజయకుమారి, గార రంగారావు, గుబ్బల గోపి, నీలాపు ఆదినారాయణబాబు పాల్గొన్నారు.

చిరస్మరణీయులు పొట్టి శ్రీరాములు

ప్రజాశక్తి - భీమవరం

మహోన్నతవ్యక్తి, అమరజీవి, త్యాగశీలి పొట్టి శ్రీరాములు అని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. పొట్టి శ్రీరాములువర్ధంతి సభ స్థానిక మెంటేవారితోటలోని సుందరయ్య భవనం వద్ద బుధవారం నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి బలరాం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఆనాడు భాష ప్రాతిపదికన ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కోసం ఎంతో ఉద్యమం నడిచిందన్నారు. ఉద్యమాల్లో కమ్యూనిస్టులు కూడా చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు. ఆనాడు నెహ్రూప్రభుత్వం రాష్ట్రాల ఏర్పాటుకు అంగీకరించలేదని, ఎన్నోదాడులు, నిర్బంధాలు పెట్టిందని గుర్తు చేశారు. పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు అకుంఠితమైన దీక్షతో అమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆయన ప్రాణ త్యాగ ఫలితంగానే తెలుగుభాష ప్రాతిపదికన రాష్ట్రం ఏర్పాటు జరిగిందన్నారు. కానీ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం హిందీ భాషను అన్ని రాష్ట్రాల మీద బలవంతంగా రుద్దాలని చూస్తోందని మండిపడ్డారు. రాష్ట్రాల హక్కులను కాలరాస్తోందని, రాష్ట్రాలకు ఉన్న హక్కులను హరిస్తోందని, రాష్ట్రాలకు ఉన్న ఆర్థిక వనరులను హరిస్తోంది విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, బి.వాసుదేవరావు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.వైకుంఠరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమవరం: ఆంధ్రరాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి, ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు అమరజీవిగా అందరిమదిలో చిరస్థాయిగా నిలిచారని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గురువారం పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు పొట్టి శ్రీరాములు విశేషకృషి చేశారన్నారు. ఆయన స్ఫూర్తి అందరికీ ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో జెసి జెవి.మురళీ, డిఆర్ఒ దాసి రాజు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి గణపతిరావు, జిల్లా అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

తణుకు : అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా రాష్ట్రపతి రోడ్‌లోని విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పొట్టి శ్రీరాములు అడుగుజాడల్లో నడిచి రాష్ట్రానికి, దేశానికి తమవంతు సేవ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఆదరణ ఓర్వలేకే ఆరోపణలు : కారుమూరి

తణుకు: సిఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చూసి ఓర్వలేక టిడిపి అధినేత చంద్రబాబు అసత్య ఆరోపణలు చేస్తున్నారని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అవినీతికి తావు లేకుండా జగన్ జన రంజకమైన పరిపాలన చేస్తున్నారని చెప్పారు. గడపగడపకూ వెళుతుంటే ప్రజలు ఎదురొచ్చి స్వాగతం పలుకుతున్నారని, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో సంతృప్తి చెందుతున్నారని తెలిపారు. జగన్ రైతులకు పెద్దపీట వేసి దళారుల వ్యవస్థ లేకుండా ప్రభుత్వమే స్వయంగా మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారన్నారు. రైతులకు, మిల్లర్లకు సంబంధం లేకుండా ప్రభుత్వమే ధాన్యం మిల్లర్లకు పంపుతున్నామన్నారు. పార్టీలకు, కులమతాలకు అతీతంగా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత జగన్‌కి దక్కుతుందన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు : ప్రజా ప్రతినిధులు

ప్రజాశక్తి - ఆచంట

రాష్ట్ర ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తోందని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాధరాజు తెలిపారు. గురువారం కొడమంచిలిలో మూడో రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి గ్రామంలో జరిగిన సంక్షేమ అభివృద్ధి గురించి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హతున్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతి యాభై ఇళ్లకు ఒక వాలంటీర్‌ను నియమించి వారి ద్వారా అందరికీ సంక్షేమ పరిపాలన అందేలా వ్యవస్థను ఏర్పాటు చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, మాజీ ఛైర్మన్ సుంకర ఇందిరా సీతారామ్, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ పాల్గొన్నారు.



భీమవరం రూరల్ : ప్రజలతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ

భీమవరం రూరల్ : ఇంటి ముంగిటకే పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు ప్రజల ఆదరణ ఎంతో ఉందని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎంఎల్ఎ యనమదుర్రులో గురువారం పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వాలంటీర్, సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ఇంటి ముంగిటకే పాలన అందిస్తున్నారని తెలిపారు. గతంలో ప్రభుత్వ పథకాలను అందుకోవాలంటే ప్రజలకు చాలా ఇబ్బందులు పడేవారని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, ఎఎంసి మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు, తహశీల్దార్ వై.రవికుమార్, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రామచంద్ర ప్రభు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి విద్యాశాఖ అధికారులకు సూచించారు. గురువారం జిల్లా కలెక్టర్ ఛాంబర్లో విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రయివేటు పాఠశాలలకు తీసుపోకుండా ఆల్ రౌండ్ గా విద్యార్థులు ఉండాలన్నారు. జిల్లాలో 1,362 మంది విద్యార్థులు బడి మధ్యలోనే మానేశారని, వీరందరినీ తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటరమణ, సమగ్ర శిక్ష ఎపి శ్యాంసుందర్, ఐసిడిఎస్ పీడీ బి. సుజాతారాణి, ఎంఇఒ పాల్గొన్నారు.

అధికారులకు హిమోగ్లోబిన్ పరీక్షలు

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు భీమవరం కలెక్టరేట్లో వివిధ శాఖల అధికారులకు, సిబ్బందికి హిమోగ్లోబిన్ పరీక్షలు గురువారం నిర్వహించారు. పరీక్షల అనంతరం వారికి ఉన్న రక్తం శాతాన్ని బట్టి ఏ విధమైన పౌష్టికాహారం తీసుకోవాలో వైద్యులు సూచించారు. అలాగే కలెక్టర్ కూడా పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో నరసాపురం సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ, వైద్యులు కీర్తి, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.



హిమోగ్లోబిన్ పరీక్షలు చేయించుకుంటున్న కలెక్టర్

విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్లు అందజేత

ప్రజాశక్తి - మొగల్తూరు

విద్యార్థులు మోడల్ టెస్ట్ పేపర్లను సద్వినియోగం చేసుకుని పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని నరసాపురం వైన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చిన్నమిల్లి సత్యనారాయణ సూచించారు. గురువారం సాయంత్రం ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి మోడల్ టెస్ట్ పేపర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్నారు. మండలంలోని 600 మంది విద్యార్థులకు దాతల సహకారంతో సమకూర్చిన మోడల్ టెస్ట్ పేపర్లను అందజేశారు. వైన్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిన్నమిల్లి సత్యనారాయణ, నరసాపురానికి చెందిన జీవాజీ గోల్డ్, మొగల్తూరు లయన్స్ క్లబ్ పింగళి గిరిజ మనోహర్ శర్మ, కట్టా వేణు గోపాలకృష్ణ పరీక్ష పేపర్ల ముద్రణకు విరాళాలు అందజేశారని యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చింతపల్లి కృష్ణమోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



పది మోడల్ టెస్టు పేపర్లను ఆవిష్కరిస్తున్న చినమిల్లి సత్యనారాయణ, యుటిఎఫ్ నేతలు

పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ సుబ్బి.శివరామకృష్ణ హెచ్చరించారు. గురువారం ఉదయం 5.20 గంటలకు 2వ డివిజన్‌లోని శానిటరీ కార్యాలయాన్ని మున్సిపల్ కమిషనర్ తనిఖీ చేశారు. ఈక్రమంలో 7, 8వ వార్డుల శానిటేషన్ సెక్రటరీలు విధులకు హాజరు కాకపోవడంపై వారికి ఒకరోజు జీతం కట్ చేయాలని ఎంహెచ్ఒను ఆదేశించారు. వారితోపాటు ఆరుగురు సిబ్బంది గైర్హాజరయ్యారు. వారికి ఒక్కరోజు జీతం కట్ చేయాలని ఆదేశించారు. ఏడో వార్డు జిఎన్‌బి కెనాల్ బండ్ క్లీనింగ్, 6వ వార్డు రాజులపేట పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఒ వేంద్ర ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



మున్సిపల్ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

రైతు కంట కన్నీరు..!

ఇంకా నీటిలో నానుతున్న వరిచేలు - రైతుల ఆందోళన

ప్రజాశక్తి - కాళ్ల

మాండూస్ తుపాను రైతులను నిండా ముంచింది. తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు పలు చోట్ల వరిచేలు నీటమునిగాయి. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 16 గ్రామాల్లో సుమారు 4,794 ఎకరాల్లో వరి సాగవుతోంది. పంట, మురుగు కాలువలను ఆనుకుని ఉన్న వరిచేల్లో వర్షపు నీరు బయటకెళ్లే పరిస్థితి లేకపోవడంతో పలు గ్రామాల్లో వరిచేలు నీటిలో నానుతున్నాయి. ఉప్పుటేరుకు ఆనుకుని ఉన్న ఏలూరుపాడు గ్రామంలో సుమారు 50 ఎకరాల్లో పంట ముంపునకు గురైంది. మండలంలో 2025 ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. కోపల్లె, వేంపాడు, పెదఅమిరం, జక్కరం గ్రామాల్లో ఎక్కువ శాతం వరి చేలకు నష్టం వాటిల్లింది. బొండాడ, సీసలి, కాళ్ల గ్రామాల్లో సుమారు 70 ఎకరాల్లో వరికి నష్టం వాటిల్లినట్లు అధికారులు గుర్తించారు. ఏలూరుపాడులో వరి చేల్లో ఇప్పటికీ నీరు తగ్గలేదు. పంట ఇంకా నీటిలో నానుతోంది. పొలాల్లో నీటిని బయటికు పంపేందుకు ఆస్కారం లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇంకా ఇలాగే ఉంటే పెట్టుబడులు సైతం దక్కేలా లేవని, అధికారులు స్పందించి పరిశీలించి నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతులు, కౌలు రైతులు కోరుతున్నారు.



నీటిలో నానుతున్న వరిచేను

నష్టపోయిన రైతులకు పరిహారమివ్వాలి

పచ్చిగోళ్ళ వెంకటరమణ, రైతు, ఏలూరుపాడు

తుపాను ప్రభావం వల్ల నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వం ఆదుకోవాలి. 15 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నాను. ప్రస్తుతం పంట నేలనంటింది. నీరు బయటకెళ్లే పరిస్థితి లేదు. దీంతో పంట కుళ్లిపోతోంది. ఎకరానికి రూ.35 వేల వరకూ పెట్టుబడి పెట్టాను. ప్రభుత్వం ఆదుకోవాలి.

పరిశ్రమల స్థాపనతోనే అభివృద్ధి

ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒ రెడ్డియ్య

ప్రజాశక్తి - పాలకోడేరు

గ్రామాల్లో పరిశ్రమల స్థాపనతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని దానిద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒ రెడ్డియ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయ ఉద్యోగులు, హెల్త్ డ్వాక్రా సంఘాల సభ్యులకు వివిధ అంశాలపై గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుతో కాలుష్యం వెదజల్లే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో తగు జాగ్రత్త వహించాలని తెలిపారు. పరిశ్రమలు ఏర్పాటు చేస్తేనే ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. ముఖ్యంగా కాలుష్య రహిత పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి పెట్టాలన్నారు. అలాగే గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు, జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని వేగంగా ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీలార్ షేక్ హుస్సేన్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, డ్వాక్రా ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒ

'జనసేన బలోపేతానికి కృషి'

ప్రజాశక్తి – కాళ్ల

గ్రామాల్లో జనసేన బలోపేతానికి అందరూ సమిష్టి కృషి చేయాల్సి ఉందని జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు అన్నారు. పెదఅమిరం, వేంపాడు గ్రామాల్లో జనసేన ఆత్మీయ సమావేశం గురువారం నిర్వహించారు. అనంతరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి నాగరాజు, కాళ్ల మండల అధ్యక్షులు ఎరుబండి రామాంజనేయులు ఆధ్వర్యంలో పెదఅమిరం గ్రామానికి చెందిన పలువురు జనసేనలో చేరారు. ఈ సందర్భంగా పెదఅమిరం, వేంపాడు గ్రామ కమిటీల నియామకం జరిగింది. వేంపాడు గ్రామ అధ్యక్షులుగా చిట్టూరి వెంకటేష్, పెదఅమిరం గ్రామ కమిటీ అధ్యక్షులుగా కొండేటి బాబు ఎన్నికయ్యారు. జుత్తిగ నాగరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో జనసేనను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు ఒగిరాల రాజేష్, గడి రాము, ప్రధాన కార్యదర్శి ఇర్రింకి జగన్ పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న వైసిపి నాయకులు

చేనేత కార్మికులకు ప్రభుత్వం అండ

ప్రజాశక్తి – ఆచంట

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి స్వర్ణోత్సవ పుట్టినరోజు వేడుకలు రెండో రోజు ఆచంట వేమవరం చేనేత కార్మికుల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్‌కుమార్ పాల్గొని కేక్‌కట్ చేసి జగన్మోహన్‌రెడ్డికి ముందస్తు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల కోసం నేతన్న నేస్తం పేరుతో ఏటా రూ.24 వేలు అందిస్తున్నారు. 50 ఏళ్లకు పింఛన్ అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కర్రిబత్తుల కార్పొరేషన్ డైరెక్టర్ అందె నాగ బసవన్న, చేనేత సొసైటీ అధ్యక్షులు గుడిమెట్ల రామలింగం, రుద్రాక్షల రామలింగం పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

ప్రజాశక్తి – వీరవాసరం

వీరవాసరం పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు సర్పంచి చికిలే మంగతాయారు గురువారం శంకుస్థాపన చేశారు. సుమారు రూ.ఐదై లక్షలతో గ్రామంలోని మూడు, నాలుగో వార్డుల్లో పైపు లైన్లు, సీసీ రోడ్లు, కల్వర్టులు, గ్రావెల్ రోడ్లు వేయనున్నట్లు సర్పంచి తెలిపారు. త్వరలో ఈ పనులు ప్రారంభిస్తామన్నారు. కరోనా నేపథ్యంలో అభివృద్ధి పనులు ఆలస్యమయ్యాయని తెలిపారు. ప్రస్తుత పరిస్థితి అనుకూలంగా ఉండడంతో గ్రామంలో ప్రధాన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి గుళ్లిపల్లి విజయలక్ష్మి, ఉపసర్పంచి బోను రాధా లక్ష్మి, ఎంపిటిసి వైస్ ఛైర్మన్ పాలా లక్ష్మీకుమారి, వార్డు సభ్యులు ప్రియదర్శిని, గునిశెట్టి కనకదుర్గ పాల్గొన్నారు.

నిఘంటువులు ఉపయోగకరం

ప్రజాశక్తి – కాళ్ల

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గతేడాది ఎస్‌సిఇఆర్‌టి ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కోసం బొమ్మలతో కూడిన నిఘంటువు తయారు చేసి అందజేసినట్లు ఎస్‌సిఇఆర్‌టి ప్యాకల్టీ టీం లీడర్ లక్ష్మీ తేజ అన్నారు. బొండాడ మెయిన్ ప్రాథమిక పాఠశాలను గురువారం స్టేట్ కౌన్సిల్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ ట్రైనింగ్, కర్నాటక రాష్ట్ర డిఎస్ఇఆర్‌టి బృందాలు సందర్శించారు. పాఠశాలలో విద్యా సంబంధిత కార్యక్రమాలు, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలించారు. విద్యార్థులతో నోట్ బుక్స్‌లో ఇంగ్లీష్ పదాలను చదివించారు. విద్యార్థులకు సరఫరా చేసిన డిక్షనరీ వారు ఎలా ఉపయోగిస్తున్నారో పరిశీలించారు. ఎస్‌సిఇఆర్‌టి ప్యాకల్టీ టీం లీడర్ లక్ష్మీ తేజ మాట్లాడుతూ డిక్షనరీలు పాఠశాల్లో ఏ విధంగా ఉపయోగిస్తున్నారో పరిశీలించామన్నారు. ప్రధానోపాధ్యాయులు మానుకొండ రాజేంద్రబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సిఇఆర్‌టి టీం సభ్యులు జికె.పద్మజ, కర్నాటక టీం సభ్యులు పి.గాధ, చెన్నప్ప, రేణుక, వినూత్న పాల్గొన్నారు.

దుష్ప్రచారం చేయొద్దంటూ వాలంటీర్ల ధర్నా

ప్రజాశక్తి – తణుకు

తమను కించపర్చే విధంగా తప్పుడు వార్తలు రాయడాన్ని ఖండిస్తూ గురువారం స్థానిక నరేంద్ర సెంటర్ వద్ద వాలంటీర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ అమలు చేస్తున్న పథకాలను ప్రజల వద్దకు చేరవేయడంలో కీలకంగా వ్యవహరిస్తున్న తమపై అసత్య ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. ఇటువంటి విధంగా వార్తలు రాసి మనోభావాలు దెబ్బతీయటున్నారన్నారు. వాలంటీర్ల వ్యవస్థపై విష ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు ఉన్నమట్ల ప్రదీప్, నక్కా రవి, డి.శివ, కిరణ్, జగదీష్ పాల్గొన్నారు.

ఘనంగా బాపు జయంతి

ప్రజాశక్తి – పాలకొల్లు

పాలకొల్లు డాక్టర్ సూర్యారావు కమ్యూనిటీ హాల్లో ఆర్టిస్ట్ అండ్ పెయింటర్స్ సంఘం అధ్యక్షులు పెనుమల్లు వెంకటరమణారెడ్డి అధ్యక్షతన చిత్రకారుడు బాపు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, చిత్రకారుడు ఉదయ్ కుమార్‌లు బాపుకు నివాళులర్పించారు. అనంతరం చిత్రలేఖనం పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చిత్రకారుడు మార్గపూడి ఉదయ్‌కుమార్, మున్సిపల్, జెడ్‌పి స్కూల్ డ్రాయింగ్ టీచర్లు, కార్యదర్శి గొల్ల సత్యనారాయణ, వైసిపి నేతలు పాల్గొన్నారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న తాతాజీ

ప్రాజెక్టు రూపొందించి.. ప్రతిభను చాటి

జిల్లా స్థాయి ప్రదర్శనకు సైన్స్ నమూనాల ఎంపిక


క్లినో మీటర్ మ్యాథ్స్ ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తున్న నోడల్ ఆఫీసర్ గాదిరాజు వెంకట రామకృష్ణంరాజు

ప్రజాశక్తి – కాళ్ల

చిట్టి బుర్రలు.. తమ ఆలోచనలకు పదును పెడుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తమ ఆలోచనలను ప్రయోగాత్మకంగా ప్రాజెక్టు రూపంలో తయారు చేసి ప్రదర్శించారు. ఏలూరుపాడు హైస్కూల్లో రెండు రోజులపాటు నిర్వహించిన మండలస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ఐదు అంశాలకు సంబంధించి విద్యార్థులు పాల్గొని తమ సత్తా చాటారు.

ఎకో ఫ్రెండ్లీ– సామగ్రి, ఆరోగ్యం–పరిశుభ్రత, పర్యావరణం– వాతావరణం, సాఫ్ట్‌వేర్, యాప్స్, గణిత సూత్రాలు తదితర అంశాలపై తమదైన రీతిలో ప్రదర్శనలు ఇచ్చారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు నమూనాలు జిల్లాస్థాయికి ఎంపిక కావడం గమనార్హం. వచ్చే జనవరిలో జరగబోయే జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొనే విద్యార్థులు తమ ప్రాజెక్టుల గురించి ప్రజాశక్తికి వివరించారు. ఆ వివరాలు వారి మాటల్లోనే..


డ్రా పెట్రోల్ ప్రాజెక్ట్ ఉన్న విద్యార్థి దినేష్

ప్లాస్టిక్ వ్యర్థాలతో డ్రా పెట్రోల్..

వి.దినేష్, 9వ తరగతి, బొండాడ హైస్కూల్

పాత నూనె డబ్బాలు, రబ్బరు ట్యూబ్‌లు, బకెట్, స్టవ్, నీటి సీసా, ప్లాస్టిక్ కవర్లను ఈ ప్రాజెక్ట్ తయారీకి ఉపయోగించాను. డ్రా పెట్రోల్ ప్రాజెక్ట్ నమూనా తయారు చేశాను. భూమిలో సహజ వనరులైన పెట్రోలియం వినియోగాన్ని తగ్గించి, పర్యావరణానికి హాని కలిగిస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాలను ఉపయోగించి డ్రా పెట్రోల్ ప్రాజెక్ట్ నమూనా తయారీ ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించాలనేది నా లక్ష్యం

కరోనా వైరస్ నివారణ కోసం..

కే.స్నేహ, పదో తరగతి, కాళ్ల హైస్కూల్

కాళ్ల హైస్కూల్లో పదో తరగతి చదువుతున్నాను. హెల్త్ అండ్ క్లీన్ నెస్ ప్రాజెక్ట్‌ను తయారుచేసి ఉపాధ్యాయులకు వివరించాను. భౌతిక దూరం పాటించాలి. మాస్కు ధరించాలి. శానిటైజర్ ఉపయోగించాలి. సబ్బుతో చేతులు శుభ్రంగా కడగడం వల్ల కరోనా వైరస్ నివారించుకోవచ్చు అనేది నా ప్రదర్శన సారాంశం.

జిల్లా స్థాయికి ఎంపిక కావడం ఆనందంగా ఉంది..

డి.రిషిత లక్ష్మి, పదో తరగతి, కోపల్లె హైస్కూల్

హోమ్ నీడ్ రోబో నమూనా ప్రాజెక్టు రూపొందించాను. జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక కావడం ఆనందంగా ఉంది.


కంట్రోల్ పొల్యూషన్ ప్రాజెక్ట్‌తో ఉన్న విద్యార్థులు భాను రాకేష్

కాలుష్యం నివారణకు..

ఎస్.భానురాకేష్, ఏలూరుపాడు హైస్కూల్

పర్యావరణం–వాతావరణ మార్పులు అంశంపై కంట్రోల్ పొల్యూషన్ ప్రాజెక్టు రూపొందించాను. పట్టణీకరణతో పాటు కాలుష్యం కూడా విపరీతంగా పెరిగిపోతోంది. వాయు కాలుష్యం కారణంగా ఎంతోమంది రోగాల బారిన పడుతున్నారు.

హెచ్ఎం సహాయంతో ప్రాజెక్టు రూపొందించా..

ఎం.శ్రావణి వల్లీ, పదో తరగతి, కలవపూడి హైస్కూల్

క్లినోమీటర్ ప్రాజెక్టు తయారుచేసి ఉపాధ్యాయులకు వివరించాను. ప్రధానోపాధ్యాయుడు గాదిరాజు వెంకట రామకృష్ణంరాజు సహాయంతో ప్రాజెక్టు రూపొందించాను.


మాట్లాడుతున్న తహశీల్దార్ సత్య సూర్య అశోక్ వర్మ

పలు చోట్ల గ్రామ సభలు


ప్రజాశక్తి – పెనుమంట్ర

రైతుల మధ్య భూ తగాదాలను జగనన్న భూ హక్కు, భూ రక్ష పథకం ద్వారా తీర్చవచ్చని తహశీల్దార్ దండు వెంకట సత్య సూర్య అశోక్ వర్మ అన్నారు. గురువారం నెగ్గిపూడి, మార్టేరు, కొయ్యేటిపాడు, సత్యవరం, ఆలమూరు, భట్లమగుటూరు, ఓడూరు, నెలమూరు, జుత్తిగ, మల్లిపూడి, నత్తారామేశ్వరం, పెనుమంట్ర గ్రామాల్లో రెవెన్యూ ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలమూరులో జరిగిన కార్యక్రమంలో అశోక్‌వర్మ మాట్లాడుతూ టీమ్ తనిఖీ చేసేటప్పుడు భూ సంబంధిత రైతులు దస్తావేజులు, పాస్ పుస్తకాలు పరిశీలించి భూ రికార్డుల్లో లోపల లేకుండా చేసేందుకు వీలుంటుందని తెలిపారు. దీనిపై భూ యజమానులకు అవగాహన కల్పించి రీ సర్వే చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలమూరు ఉపసర్పంచి కొవ్వూరి సుబ్బిరెడ్డి, వైసిపి గ్రామ అధ్యక్షుడు ద్వారంపూడి నారాయణరెడ్డి, విఆర్ఒ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ఇ.పాండురంగారావు, డిప్యూటీ తహశీల్దార్ కె.ఏలియమ్మ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వై.అప్పారావు, సీనియర్ అసిస్టెంట్ కెవివి సుబ్బారావు, సిఎస్ఆర్ఐ పోతు రాజు, ఎఎస్ఒ అశోక్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఒలు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు ఆదర్శం

ప్రజాశక్తి – భీమవరం రూరల్

అమరజీవి పొట్టి శ్రీరాములును ప్రతి పౌరుడూ గుర్తుంచుకోవాలని టిడిపి భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి తెలిపారు. గురువారం పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా టిడిపి వాణిజ్య విభాగ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గునుపుటి తిరుపాల్ ఆధ్వర్యంలో నాయకులు పట్టణంలోని శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తోట సీతారామలక్ష్మీ మాట్లాడారు. శ్రీరాములను తెలుగువారు మరవకూడదన్నారు. రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు మామిడిశెట్టి ప్రసాద్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.


భీమవరంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న టిడిపి నేతలు

పెనుమంట్ర : మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానంలో వ్యవసాయ పాలిటెక్నిక్‌లో పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ పాలిటెక్నిక్ వైస్ ప్రిన్సిపల్, ప్రధాన శాస్త్రవేత్త (అగ్రనామి) కెఎం.దక్షిణామూర్తి, సీనియర్ శాస్త్రవేత్త వై.సతీష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ శాస్త్రవేత్త అకడమిక్ ఇన్‌ఛార్జి వై.సతీష్, కెఎం దక్షిణామూర్తి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.


పెనుమంట్రలో నివాళులర్పిస్తున్న శాస్త్రవేత్తలు

తాడేపల్లిగూడెం : స్థానిక ఏలూరు రోడ్డులోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆడిటోరియం వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మండవిల్లి నాగేంద్రరావు, సెక్రటరీ మండ బ్రహ్మాజీ, ట్రెజరర్ నున్న సుందర్రావు, ఆర్యవైశ్య సంఘం కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ నాగేంద్ర మాట్లాడుతూ వారి ఆశయాలకు అనుగుణంగా అందరం నడుచుకోవాలన్నారు.

18న విఆర్ఒల సంఘం రాష్ట్రస్థాయి సమావేశం

ప్రజాశక్తి – పెనుమంట్ర

విఆర్ఒల సంఘం రాష్ట్ర స్థాయి అత్యవసర సమావేశం ఈ నెల 18వ తేదీన విజయవాడలో గాంధీనగర్ ప్రెస్‌క్లబ్ సమావేశ హాల్లో జరగనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతి రాజు రవీంద్ర రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో విఆర్ఒల ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. ఇటీవల పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం మామిడిపల్లి విఆర్ఒ సంతోష్ చెట్టుకు ఉరి వేసుకొని చనిపోవడం, విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం రావివలస విఆర్ఒ సీతారాం గుండెపోటుతో చనిపోవడంతో రాష్ట్రంలోని విఆర్ఒలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై అత్యవసర సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర కమిటీ సభ్యులు, అన్ని జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు.

మొగల్తూరులో అన్నదానం

మొగల్తూరు: మొగల్తూరులోని చేపల మార్కెట్ వీధిలోని అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం రాత్రి భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఇటీవల ఆలయ 40వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

2కె రన్‌ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి – పాలకొల్లు

ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 18వ తేదీ ఆదివారం ఉదయం గాంధీబొమ్మల సెంటర్లో చేపట్టనున్న సేవ్ ది గర్ల్, 2కె రన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు పిలుపు ఇచ్చారు. పట్టణంలోని ఎంఎంకెఎన్ఎం హైస్కూల్, ఉల్లంపర్రు మాంటిస్సోరీస్ స్కూల్, ఎల్ఆర్ పేట మాంటిస్సోరీస్ స్కూల్, కాలేజ్, ఛాంబర్స్ కాలేజ్, భారతీయ విదా భవన్స్ స్కూల్, గురుకుల విద్యాలయాలను ఆయన గురువారం సందర్శించారు. విద్యార్థుల సేవ్ ది గర్ల్, చైల్డ్ 2కె రన్ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా రామరాజు పుట్టినరోజు

ప్రజాశక్తి – మొగల్తూరు

మొగల్తూరులోని గాంధీ బొమ్మ సెంటర్‌లో టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు పుట్టినరోజు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను పార్టీ మండల అధ్యక్షులు గుబ్బల నాగరాజు కట్‌చేసి ప్రజలకు పంపిణీ చేశారు. అనంతరం నరసాపురంలోని టిడిపి కార్యాలయానికి ప్రదర్శనగా వెళ్లారు. ఈ సందర్భంగా రామరాజుకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

నరసాపురం : టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి రామరాజు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ అగ్నికుల క్షత్రియ సాధికారిక కన్వీనర్, బిసి నాయకుడు కొప్పాడి రవీంద్రనాథ్ ఠాగూర్ (రవి), మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ అధికారి అనంత రామారావు పొన్నాల నాగబాబు పాల్గొన్నారు.

క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో అన్నదానం

పాలకొల్లు: పాలకొల్లు క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో గురువారం నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ఆలయ ఛైర్మన్ కోరాడ శ్రీనివాస్ ప్రారంభించారు. తొలిరోజు జెడ్‌పి ఛైర్మన్ పుట్టిన రోజు సందర్భంగా బొడ్డు సాయికుమార్ అన్నదానం చేశారు. రోజూ దాతల సహకారంతో ఈ కార్యక్రమం జరుగుతుందని ఇఒ యు.సూర్యనారాయణ చెప్పారు. కార్యక్రమంలో ట్రస్టీలు జ్యోతి బాలాజీ, పద్మ పాల్గొన్నారు.